రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.35, వంకాయ రూ.28, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.45, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.15, సొరకాయ రూ.17, పొట్లకాయ రూ.23, అరటి కాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.40, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.25, కీర రూ.18, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.45.

ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కేబుళ్లు తొలగించొద్దంటూ సీఎంకు వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జితేందర్

చంపాపేట: విద్యుత్ స్తంభాలకు కేబుల్ టీవీ, ఇటర్నెట్ సౌకర్యాలు కల్పించే విద్యుత్ ప్రవాహ నిరోధక ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ తొలగింపు ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని ఆదివారం చంపాపేటకు చెందిన రాష్ట్ర కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలికాం సర్వీసెస్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జితేందర్ మాట్లాడుతూ..కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్ కేబుల్ కనెక్షన్ ప్రొవైడర్లు రాష్ట్రంలోని కోట్లాది మందికి సేవలను అందిస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు. కేబుల్ సంస్థల నిర్వాహకులకు కొంత సమయం ఇస్తే కరెంట్ పోల్స్‌కు ఏర్పాటు చేసిన కేబుల్స్‌ను క్రమబద్ధీకరించి ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా చేస్తామన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: నిజాన్ని నిక్కచ్చిగా అక్షర బద్ధము చేసిన అక్షర శిల్పి దివంగత డా. వడ్డేపల్లికృష్ణ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు.వడ్డేపల్లికృష్ణ రాసిన సాయి చరితం– కీర్తనం పుస్తకావిష్కరణ ఆదివారం కొత్తపేట డివిజన్ సమతాపురి కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వడ్డేపల్లి కృష్ణ రాసిన అంకితం పుస్తకం అద్భుతంగా ఉందని ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన బాటలో వారి కుమారులు నడిచి ఆయనకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీనాథ్, గంజి సత్యనారాయణ, చిలువేరు రఘురాం, సత్యనారాయణ, ఈశ్వర్, పాండు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: క్రమం తప్పకుండా క్రీడలపై శ్రద్ధ వహిస్తే యువకులలో శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మహంకాళమ్మతోట కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, దశరథగౌడ్, శ్రీనివాస్, యోగిరాజ్ పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇషాన్ట్ దుబే

వనస్థలిపురం: అంతరిక్షంపై జరుగుతున్న పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం సభ్యుడు ఇషాన్ట్ దుబే అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా వనస్థలిపురంలోని లోటస్ ల్యాప్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్పేస్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆయన హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్, మాంగల్యాన్, చంద్రయాన్–3, పీఎస్‌ఎల్‌వీ, జీఎస్‌ఎల్‌వీ, నారీశక్తి ఇన్ స్పేస్, ఐఎస్ఆర్‌ఓ, సోలార్ సిస్టం తదితర నమూనాలను తిలకించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ మంజులారెడ్డి, జోనల్ ప్రిన్సిపాల్ ఉషాకిరణ్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఏసీపీ సుబ్బిరామిరెడ్డి



మాట్లాడున్న ఏసీపీ కృష్ణయ్య

చాదర్‌ఘాట్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి సూచించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పాత మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని సిమ్లా గార్డెన్స్‌లో మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. మండపాల ఏర్పాటుకు స్థానిక పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాలను రహదారులపై కాకుండా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని, ఒక వేళ రోడ్డుపై ఏర్పాటు చేయాల్సి వస్తే రాకపోకలకు అంతరాయం కలుగకుండా చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, ఇన్‌స్పెక్టర్లు బ్రహ్మ మురారి, నరేష్, నాను నాయక్ పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు..

నాగోలు: గణేష్ వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల్లో భక్తి పాటలు పెట్టి ఆధ్యాత్మికతను పెంచేలా చూడాలని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లోని కుషాల్ ఫంక్షన్ హాల్లో మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి తీసుకోవాలన్నారు. మండల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, బలవంతంగా చందాలు వసూలు చేయవద్దని సూచించారు. మండల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు, జూదాన్ని నిర్వహించరాదన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కలిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాల్లో అసత్య ప్రచారాలు చేస్తే, మత ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సీఐ వినోద్‌కుమార్, సీఐలు, వివిధ కాలనీ వాసులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: పెద్దచెరువు ప్రాంగణంలోని నిమజ్జన కొలనులో వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టనున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి తెలిపారు. పెద్దచెరువు ప్రాంగణంలో ఆదివారం ఆయన బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. నిమజ్జనానికి వచ్చే రహదారుల వెంట ఉన్న రోడ్డు ఆక్రమణలు తొలగించడం జరుగుతుందని, రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను కూడా తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేమన్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, రామచంద్రారెడ్డి, కృష్ణ, కవితారెడ్డి నాయకులు హరీష్‌రెడ్డి, లింగాచారి పాల్గొన్నారు.

ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయాలి



మాట్లాడుతున్న రామచంద్రారావు

హస్తినాపురం: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మీడియా, ఐటీ, సోషల్ మీడియా కార్యక్రమాలను నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండి పుల్లారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా, సోషల్ మీడియా వర్క్ షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మీడియా, సోషల్ మీడియా వేదికలు ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయడంలో కీలకంగా మారాయన్నారు. పార్టీ సిద్ధాంతాలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సమస్యల పరిష్కార చర్యలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త సోషల్ మీడియాను సక్రమంగా వినియోగించుకుని తప్పుడు ప్రచారాలను వెంటనే ఖండించే విధంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మన్, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపి పార్టీ అధ్యక్షుడు వన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాలల అభివృద్ధే లక్ష్యం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

మలక్‌పేట: మాలల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని మలక్‌పేట మాల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ అన్నారు. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్ బాలదానమ్మ బస్తీ కమ్యూనిటీహాల్లో ఆదివారం నిర్వహించిన సంఘం మూడో వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. మాలల ఐక్యత చాటుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.అంతకు ముందు మృతి చెందిన సంఘ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. బాలదానమ్మ బస్తీ నుంచి ర్యాలీగా తరలి వెళ్లి మూసారంబాగ్ చౌరస్తాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ధన్వంత్, నర్సింగ్‌రావు, రాంచందర్, శ్రీకాంత్, వినోద్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఐఎస్‌సదన్‌లోని కృష్ణానగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఐఎస్‌సదన్‌లోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయా కాలనీ, బస్తీవాసులు సైతం తరుచూ పరిశీలిస్తుండాలని సూచించారు. ఏమైనా అవకతవకలు గుర్తిస్తే తనకు సమాచారం ఇస్తే అధికారులతో కలిసి అక్కడ పర్యటించి వాటిని సరిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, శ్రీను, సునీల్‌కుమార్, కుందన్, శంకర్, నరసయ్య, రాంబాబు పాల్గొన్నారు.

నీటిలోనే కాలనీలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న అరవింద్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు వివిధ కాలనీలు జలమయమయ్యాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, వినూత్ననగర్ కాలనీల్లో ఇంకా నీరు నిలిచే ఉంది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డికి ఆదివారం కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. పైకాలనీల నుంచి వచ్చే వరద నీరు, మురుగునీరు గాంధీనగర్ సౌత్‌కాలనీ, వినూత్న ఎన్‌క్లేవ్ కాలనీలకు చేరడంతో ఇబ్బందుదు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: చిన్నపాటి వర్షానికే పైకాలనీల నుంచి వచ్చే వరదతో ఆగమయ్యనగర్ నీటమునిగేదని ఎస్ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ల పనులతో వరద ముంపు తగ్గిందని, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్‌నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో వేసిన డ్రైనేజీ పైపుల ఆధునీకరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. పెద్దచెరువు శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తామన్నారు. రెండు రోజుల క్రితమే జోనల్ కమిషనర్‌తో పర్యటించానని ఆయన సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విఠల్ రెడ్డి, మల్లారెడ్డి, జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్రయాదగిరి, కరుణాకర్, అంజయ్య, యాదగిరి పాల్గొన్నారు.

హెల్పర్ బోర్డు నిధులు ఇతర సంస్థలకు మళ్లించొద్దు



సమావేశమైన భవన నిర్మాణ కార్మికులు

చైతన్యపురి: భవన నిర్మాణ కార్మికుల హెల్పర్ బోర్డులో ఉన్న నిధులను ఇతర సంస్థలకు మళ్లించవద్దని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పార్వతి, భవన నిర్మాణ కార్మిక యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చైతన్య అన్నారు. సరూర్‌నగర్ భవన నిర్మాణ కార్మిక యూనియన్ నాలుగవ మహాసభ చైతన్యపురిలోని కామ్రెడ్ బోడేపూడి వేంకటేశ్వర స్మారక కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ఉన్నవారికి రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ ప్రాంతంలో అడ్డా కార్మికులకు అందుబాటులో ఉండేలా ఏఎల్‌ఓ కార్యాలయం సరూర్‌నగర్ సర్కిల్ ఉండాలన్నారు. ఈ సందర్భంగా 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో రామ్మోహన్, చైతన్య, శంకర్, లతీఫ్, పరశురాములు, యాదగిరి, శంకర్, పి.శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి



ఎస్సై నవీన్‌ను సన్మానిస్తున్న ఏసీపీ

మలక్‌పేట: విధి నిర్వహణతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మలక్‌పేట ఏసీపీ సుబ్బారామిరెడ్డి అన్నారు. తీగలగూడలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మలక్‌పేట పోలీస్‌స్టేషన్ విధులు నిర్వహించి పదవీ విమరణ పొందిన వారికి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్సైలు నవీన్, సురేష్, కానిస్టేబుళ్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజల ఆదరాభిమానాలు చూరగొనేలా పని చేయాలని, ఉన్నతంగా ఎదిగి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జయశకంర్, ఎస్సైలు సంజీవ్‌రెడ్డి, తేజ్యానాయక్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న మార్గం రాజేష్

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట అగర్వాల్, సత్యశక్తి మహిళా శాఖ ఆధ్వర్యంలో ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు అగ్రసేన్ మహారాజ్ పురస్కారం అందజేశారు. 49 సంవత్సరాల క్రితం ఒక్క రూపాయి, ఒక్క ఇటుక పిలుపుతో దేశంలో సామాజిక కార్యక్రమాలు, పేదలకు ఇళ్లు కట్టించిన గుర్తుగా అత్యున్నత పురస్కారాన్ని అగ్రసేన్ మహారాజ్ పేరుమీద ఇస్తామని శాఖా అధ్యక్షులు రాణి మిత్తల్ పేర్కొన్నారు. మార్గం రాజేష్ చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

మలక్‌పేట: ప్రతి ఒక్కరూ కళ్లపై శ్రద్ధ తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ఛావుణి డివిజన్‌లో చేపట్టిన ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు.పంజేషాహలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా 50 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మహిళకు కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే బలాల

వ్యక్తి అదృశ్యం



అజయ్‌రాయ్

చంచల్‌గూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌రాయ్ (40) బతుకుదెరువు కోసం ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. ఇంట్లో గొడవ కారణంగా గత సోమవారం ఇంటి నుంచి వెళ్లి ఎంతకీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్

వ్యక్తిపై కేసు నమోదు

చైతన్యపురి: అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నింపి విక్రయిస్తున్న ఇంటిపై పోలీసులు దాడిచేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. ద్వారకాపురి కాలనీలో చిన్న సిలెండర్లలో గ్యాస్ నింపి అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 12 గృహ వినియోగ సిలిండర్లు, రెండు చిన్న సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీరని లోటు



సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాలనీవాసులు



మన్సూరాబాద్‌లో..

నాగోలు: ప్రజా నాయకుడు మార్క్సిస్టు మేధావి, నలగొండ మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మరణం ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్ జైపురికాలనీ ఫేస్–1 సీపీఐ శాఖ అధ్యక్షులు ఎండీ బషీర్ అధ్యక్షతన సురవరం సధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన నాయకుడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, యాదగిరి, శ్రీధర్ రెడ్డి, వెంకటయ్య, ఉడతల మల్లేష్, ఎస్. రాములు, ఆదినారాయణ, సూరారం రాములు, రాసమల్ల రాజేందర్ పాల్గొన్నారు.

రెడ్డికాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఎల్‌బీనగర్‌లోని రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సురవరం సుధార్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఐఎన్‌టీయూసీ ట్రేడ్ యూనియన్ నాయకుడు రాజిరెడ్డి మాట్లాడుతూ.. బుడుగు బలహీనవర్గ ప్రజలకు కార్మిక, కర్షక, ఉద్యోగ ఉపాధ్యాయవర్గానికి ఎన్నో హక్కులు సాధించి పెట్టిన మహానేత సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, బీఎస్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, స్వామిరెడ్డి, అంజయ్య, డీఎస్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దైవప్ప, ఎల్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో..

సీపీఐ సరూర్‌నగర్ మండల పార్టీ ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లో సురవరం సుధార్‌రెడ్డి చిత్రపటానికి రాములుగౌడ్, కందుల సుధాకర్, పూజారి శ్రీనివాస్, శోభ, లింగస్వామి, విక్రమ్, ఎల్లయ్య, ఇందిరా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాహుల్ గాంధీ ఉద్యమానికి మద్దతివ్వాలి



కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ చోరీ అంశంలో చేస్తున్న ఉద్యమానికి అందరూ మద్దతు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కోరారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ వాణీనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజలకు అందజేసిన ఓటు హక్కును బీజేపీ అగ్ర నాయకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. ఓటు చోరీ విధానంలోనే బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిందని బీజేపీ నాయకుల ఓట్ చోరీ వ్యవహారాన్ని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో సహా బయట పెట్టారన్నారు. రాహుల్ గాంధీ వెల్లడించిన బీజేపీ నాయకుల ఓట్ చోరీ వ్యవహారాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365